క్లుప్తంగా

మాతృ భాషను మరువలేం

ముమ్మిడివరం: మాతృ భాష తెలుగును ఎప్పటికీ మరువలేమని ప్రముఖ కవి, తెలుగు పండితులు మాకే బాలార్జున సత్యనారాయణ అన్నారు. స్థానిక బాలాజీ విద్యాసంస్థల్లో తెలుగు భాషా దినోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన సాహితీ సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా సత్యనారాయణను సత్కరించారు. కార్యక్రమంలో కళాసాహితీ ఉపాధ్యక్షుడు పొత్తూరి లక్ష్మీశ్రీనివాస్, వ్యవస్థాపక అధ్యక్షుడు పచ్చిమాల శివనాగరాజు, పీవీఎస్ వర్మ, విద్యాసంస్థల వ్యవస్థాపకుడు పీవీ సీతారామశాస్త్రి, పి.సుజాత, పుల్లెపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతర మహోత్సవాలు

ముమ్మిడివరం: మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవా లు గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. తానేల్లంక వడ్డిగూడెం పరిసర ప్రాంతాలకు చెందిన 12 గ్రామాల ప్రజలు ప్రతి మంగళ, శుక్రవారాల్లో వంతుల వారీగా మూడు నెలల పాటు అమ్మవారి జాతర నిర్వహిస్తారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎంపీపీ కోలా గంగా భవాని, గ్రామ సర్పంచ్ నక్కా విజయకుమారి, శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకున్నారు.

కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి

తాళ్లరేవు: కేంద్ర బడ్జెట్ పేదలకు నష్టం చేకూర్చేలా ఉందని, దానిని తక్షణమే సవరించాలని సీపీఎం నాయకుడు వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని జార్జిపేటలో ఈ మేరకు కరపత్రాలను ఆవిష్కరించి, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం, ఉత్తరాంధ్ర ప్యాకేజీ, విభజన హామీలు, రైల్వే జోన్ ఇవ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 24వ తేదీన తాళ్లరేవు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఐ.పోలవరం: 33 కేవీ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఈఈ మోకా రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

మాదిగలకు గుర్తింపునిచ్చింది సీఎం జగనే

అమలాపురం రూరల్: స్వాతంత్య్రం వచ్చిన 75 ఏళ్ల చరిత్రలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మాదిగలకు శాసన మండలిలో స్థానం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిదేనని బాబూ జగ్జీవన్‌రాం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మోకాటి నాగేశ్వరరావు అన్నారు. బొమ్మి ఇజ్రాయిల్‌కు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంపై నడిపూడిలోని జగ్జీవన్ రామ్ సామాజిక భవనంలో జరిగిన సమావేశంలో మాదిగ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడికి సత్కారం

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన అమలాపురానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు మట్టపర్తి నాగేంద్రను పార్టీ నాయకులు స్థానిక సూర్యనగర్‌లో పూలమాలతో సత్కరించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ అభ్యర్థి కుడుపూడి సూర్యనారాయణరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్ తదితరులు నాగేంద్రను అభినందించారు.

సీఎం జగన్‌తోనే మహిళా సాధికారిత

మహిళా అభ్యున్నతి, సాధికారత ముఖ్యమంత్రి జగన్‌తోనే సాకారం అవుతుందని హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాల మునికుమారి తెలిపారు. అమలాపురంలో ఆమె గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో పొంది పరిచినట్లుగా అన్ని వర్గాల వారికి సమ న్యాయం అందేలా సీఎం జగన్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ల అమలు చేసి కీలక పదవులు ఇచ్చారన్నారు.

పుష్పక వాహనంపై విహరించిన వెంకన్న

యానాం: యానాం భూసమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం పుష్పక వాహనోత్సవం ఘనంగా నిర్వహించారు. శింగంశెట్టి లక్ష్మీకుమారి కుమారులు, మనుమలు ఉత్సవదారులుగా నిర్వహించిన వాహనోత్సవంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏఓ మునిస్వామి, డీటీ సత్యనారాయణన్ తదితరులు హాజరై స్వామికి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ, ఎస్ఐ శేరు నూకరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

అమలాపురం రూరల్: ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ పరిష్కార వేదిక చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అన్నారు. గురువారం ఈదరపల్లిలో ఏపీఈపీడీసీఎల్ ఈఈ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలపై వినియోగదారులతో వేదిక నిర్వహించారు. లేఅవుట్లల్లో కొత్త కనెక్షన్ల కోసం, మీటర్ల హెచ్చుతగ్గులు తదితర సమస్యలపై 8 మంది పరిష్కార వేదిక చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు ఎస్.హరిబాబు, డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్, పి.శ్రీనివాస్, ఏపీఈపీడీసీఎల్ ఈఈ మోకా రవికుమార్ పాల్గొన్నారు.

పెంకు పోయె.. ఫైబర్ వచ్చె..

- అంతరించిపోతున్న పెంకు నేత కళ
- ఫైబర్ సీట్లతో పెంకుటిళ్లకు కొత్త శోభ


గోడిలో పాత పెంకుటిల్లుపై పెంకుల స్థానంలో వేసిన ఫైబర్ సీట్లు


దేవగుప్తంలో పెంకులు తిరగేస్తున్న నేతగాళ్లు

అల్లవరం: మూడు దశాబ్దాల క్రితం వరకు గ్రామాల్లో ఎవరికైనా పెంకుటిల్లు ఉంటే గొప్పింటివారుగా సమాజంలో పేరు ప్రతిష్టలుండేవి. వారి ఆర్థిక పరిస్థితికి తగ్గట్టుగా నల్ల మద్ది, టేకు, బర్మా టేకులతో వాసాలు తయారు చేసి ఇంటి నిర్మాణానికి వాడుకునేవారు. దానికి తగ్గట్టుగా అందంగా పెంకుటిల్లుని తీర్చిదిద్దేవారు. వేసవికాలంలో ప్రస్తుత ఏసీలకు మించిన చల్లదనం, వర్షాకాలం, శీతాకాలంలో వెచ్చదనం పెంకుటిల్లు ఇచ్చేది. అయితే అప్పట్లో కట్టిన పెంకుటిళ్లన్నీ శిథిలమై క్రమంగా కనుమరుగైపోతున్నాయి. గత కొన్నేళ్లుగా పక్కా నిర్మాణాలు, డూప్లెక్స్‌లు అందుబాటులోకి రావడంతో పెంకుటిళ్లు చరిత్రగా మిగిలిపోతున్నాయి.

నిర్వహణ భారమై.. నేతగాళ్లు కరవై..

నాలుగైదు దశాబ్దాల క్రితం నిర్మించిన పెంకుటిల్లులకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పెంకులను తిరగేయాలి. ప్రస్తుతం పెంకుల తయారీ సైతం గణనీయంగా తగ్గిపోయింది. కనీసం పాత ఇళ్ల నుంచి తీసేసిన పెంకులతో అమర్చుకుందామంటే పెంకు నేతగాళ్లు కరవైపోయారు. అమలాపురం పరిసర ప్రాంతాల్లో కేవలం పది మంది మాత్రమే ఈ పని చేస్తున్నారు. మొత్తంగా పెంకుటిళ్ల నిర్వహణ భారంగా మారింది. లభ్యం కాని పెంకులు, నేతగాళ్లు అందుబాటులో లేక పెంకుటిళ్ల స్థానంలో ఫైబర్ ఇళ్లు పుట్టుకొస్తున్నాయి. తరతరాలుగా తమ పూర్వీకులు నిర్మించిన పెంకుటిళ్లను కూల్చడం ఇష్టం లేక కొందరు పెంకుల స్థానంలో కొత్త టెక్నాలజీతో అందుబాటులోకి వచ్చిన ఫైబర్ రేకుల్ని ఏర్పాటుచేసుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి

అల్లవరం మండలం గోడిలో రుద్రరాజు శ్రీనివాసరావు తన పెంకుటిల్లుపై ఉన్న పైకప్పు పెంకులను తొలగించి వాటి స్థానంలో ఫైబర్ సీట్లతో ఆధునికీకరించారు. ప్రస్తుత మార్కెట్‌లో ఫైబర్‌కు ప్రత్యేక స్థానం ఉండడంతో నాణ్యమైన ఫైబర్ సీట్లతో పాత ఇంటిని సుందరీకరిస్తున్నారు. కోనసీమలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి ఆవరణలో కొబ్బరిచెట్ల నుంచి కాయలు పడి పెంకులు, రేకులు ధ్వంసమవుతుంటాయి. ఫైబర్ సీట్లు అందుబాటులోకి రావడంతో ఆ పరిస్థితి లేదని గృహస్థులు చెబుతున్నారు. ఫైబర్ సీట్లు బలంగా, దృఢంగా ఉంటున్నాయని, తుప్పు పట్టే పరిస్థితి లేదంటున్నారు. గుడ్డివానిచింత వద్ద ఓ న్యాయవాది తన డాబాపైన రెండో అంతస్తుకి ఫైబర్ సీట్లు ఏర్పాటు చేసి పాత ఇంటికి కొత్త శోభని తీసుకొచ్చారు. అటుగా వెళుతున్న ప్రయాణికులు ఆ ఇంటిపై ఓ లుక్కేసి మరీ వెళుతున్నారు.

ఆశీలు ఇబ్బందులను పరిష్కరించాలి


ఆశీలు సమస్యపై మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణికి వినతి పత్రం అందిస్తున్న వ్యాపార సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఆశీలు చెల్లింపు విషయంలో లారీల సిబ్బంది, వ్యాపారుల మధ్య నెలకొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడులకు గురువారం వినతి పత్రాలు అందించి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. గతంలో దుకాణాలకు సరుకులు తీసుకొచ్చే లారీల సిబ్బందే మున్సిపాలిటీకి ఆశీలు చెల్లించేవారని, ఇప్పుడు వారు నిరాకరిస్తున్నారన్నారు. దుకాణదారులే ఆశీలు చెల్లించాలన్న వాదన తెర మీదకు తీసుకొచ్చారన్నారు. అయితే తాము సరకులు కొనుగోలు చేసినప్పుడే అన్ని చార్జీలు సంబంధిత బట్వాడా సంస్థలకు చెల్లించేస్తామని వ్యాపారులు విన్నవించారు. రానున్న మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని అజెండాలోకి తీసుకొచ్చి చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని చైర్‌పర్సన్, కమిషనర్‌లు వారికి వివరించారు. వినతి పత్రాలు ఇచ్చినవారిలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, యెండూరి నాగేశ్వరరావు, తిక్కిరెడ్డి రాంబాబు, కుప్పాల రామకృష్ణ, అప్పలరాజు తదితరులున్నారు.

బాలల సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి


ఓల్డ్ రాజీవ్‌నగర్‌లో గ్రామస్థాయి బాలల రక్షణ కమిటీ సమావేశం

యానాం: బాలల సమస్యలు లేని గ్రామాలుగా యానాం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దాలని చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం ఓల్డ్ రాజీవ్‌నగర్ కమ్యూనిటీ హాలులో విలేజ్ లెవల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేలా గ్రామస్థాయి కమిటీలు ప్రయత్నించాలని కోరారు. గ్రామస్థాయిలో సేవలు అందించే ఆశా వర్కర్స్, ఆరోగ్య సిబ్బంది, గ్రామ పెద్ద లు, యువజన సంఘా లు, మహి ళా సంఘాల నాయకులు బాధ్యత వహించి పిల్లల సమస్యలను తమకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది మంగ, ఎఎన్ఎం లలిత, ఆశా వర్కర్ రాణి, గ్రామపెద్దలు ముత్తయ్య, దుర్గారావు, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే డీసీసీఎం యానాం సందర్శన

యానాం: దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ కమర్షియల్ మేనేజర్ సుఖేష్ దీపక్ బుధవారం యానాంను సందర్శించారు. యానాంలోని పలు పర్యాటక ప్రదేశాల్లో పర్యటించారు. ముందుగా స్థానిక రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను పరిశీలించి అనంతరం స్థానిక రీజనల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దీపక్‌ను ఆర్ఏఓ మునిస్వామి, ఫ్రెంచి ప్రతినిధి సాధనాల బాబు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానిక రాజీవ్ రివర్‌బేను సందర్శించి పర్యాటక బోటుపై గౌతమీ గోదావరిలో విహరించారు. కార్యక్రమంలో కమర్షియల్ ఇన్‌స్పెక్టర్స్ చంద్రశేఖర్, మదన్‌కుమార్, సతీష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇద్దరికి రిమాండ్

కాట్రేనికోన: ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు రెండు సామాజిక వర్గాలను రెచ్చగొట్టేలా మాట్లాడిన చీకురుమిల్లి రవికుమార్, కాశి దుర్గా ప్రసాద్‌లకు ముమ్మిడివరం కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. ఆయా సామాజికవర్గాల నుంచి అందిన ఫిర్యాదులతో కాట్రేనికోన ఎస్ఐ టి.శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని సిద్దిపేటలో తలదాచుకున్న వారిద్దరినీ అరెస్టు చేసి ముమ్మిడివరం కోర్టు ముందు హాజరుపరిచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

బోడసకుర్రు గ్రామ సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీ


బోడసకుర్రు సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ విజయ్ థామస్


అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధిలో ఉన్న రెండు గ్రామ సచివాలయాలను డీఎల్‌డీఓ విజయ్‌థామస్ మండల ఎంపీడీఓ సరోవరరావుతో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల హాజరు, మూమెంట్ రిజిస్టర్, స్పందన ఫైల్స్ పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులు వారి శాఖలకు సంబంధించి నిర్వహించాల్సిన రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఉద్యోగులను తొలి తప్పుగా హెచ్చరించారు. ఇక మీదట నిర్వహణ లోపిస్తే సహించేది లేదన్నారు. ప్రజలకు సచివాలయ ఉద్యోగులు స్నేహపూర్వకంగా మెలగాలని, పౌర సేవలను నిర్ణీత గడువులోగా అందించాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి దుర్గా శ్రీనివాస్, ఉద్యోగులు ఉన్నారు.

జాబ్ మేళాలో 50 మందికి ఉద్యోగాలు


జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులతో జిల్లా వికాస మేనేజర్ రమేష్ తదితరులు


అమలాపురం టౌన్: స్థానిక ది అమలాపురం డిగ్రీ కళాశాలలో వికాస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 50 మంది నిరుద్యోగులకు పలు కంపెనీల్లో ఉద్యోగాలు దక్కాయి. ఐసీఐసీఐ బ్యాంక్, దక్కన్ కెమికల్స్, ఎన్ఐఐటీ తదితర కంపెనీలు నిర్వహించిన ఈ జాబ్ మేళాకు జిల్లావ్యాప్తంగా మొత్తం 200 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఆయా కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 50 మంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించారని జిల్లా వికాస మేనేజర్ గోళ్ల రమేష్ తెలిపారు. జాబ్ మేళాలో ది అమలాపురం డిగ్రీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎం.రాంబాబు, కళాశాల డైరెక్టర్లు జీవీఎస్ నాయుడు, ఎం.కిరణ్‌కుమార్, ఎం.సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ సకిలే వెంకటేశ్వరరావు, పలు కంపెనీల హెచ్ఆర్‌లు పాల్గొన్నారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను వికాస మేనేజర్ రమేష్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి


మృతిచెందిన సాయిబాబు

అమలాపురం రూరల్: అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల సమీపంలో అబ్బిరెడ్డి కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద 216 జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపేటకు చెందిన ఫొటోగ్రాఫర్ ఆదిమూలం సాయిబాబు (20) మృతి చెందాడు. మహిపాల ప్రేమ్‌కుమార్, మేర్ల ఆది గంగరాజు, ఆదిమూలం సాయిబాబు ఒకే మోటారు సైకిల్‌పై ముమ్మిడివరం మండలం గేదెల్లంక గ్రామానికి వివాహ ఫొటో షూటింగ్ కోసం వెళ్లారు. అక్కడ పని ముగించుకుని గురువారం ఉదయం తిరిగి తమ సొంతూరు కొత్తపేటకు అదే మోటారు సైకిల్‌పై బయలు దేరారు. అబ్బిరెడ్డికాలనీ విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు వచ్చేసరికి అమలాపురం వైపు వస్తున్న మినీలారీ ఆ మోటారు సైకిల్‌ను అతివేగంగా ఢీ కొట్టింది. గాయపడ్డ వారిని సమీపంలోనే ఉన్న కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయిబాబు మృతి చెందాడని ఎస్సై పరదేశీ తెలిపారు. యువకుడి మృతికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. గాయపడ్డ మిగిలిన ఇద్దరూ చికిత్స పొందుతున్నారు.

ఎంపీ అనురాధని కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఇజ్రాయిల్


ఇజ్రాయిల్ దంపతులను అభినందిస్తున్న ఎంపీ అనురాధ

అల్లవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థి బొమ్మి ఇజ్రాయిల్ మొగళ్ళమూరులోని ఎంపీ నివాసంలో గురువారం ఎంపీ అనురాధని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ దంపతుల్ని ఎంపీ అనురాధ అభినందించారు. ఆయన వెంట గోడి వైఎస్సార్‌సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు దొమ్మేటి వెంకటేశ్వరరావు, రుద్రరాజు సీతబాబు, రేవు శ్రీనివాసరావు, జల్లి ఏడుకొండలు, మల్లవరపు శ్రీను తదితరులున్నారు.

పంట పొలాల పరిశీలన

తాళ్లరేవు: మండల పరిధిలోని పి.మల్లవరం గ్రామ పంచాయతీలో సాగునీరు లేక ఎండిపోయిన పంట పొలాలను అమలాపురం పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జ్ గంటి హరీష్ మాధుర్ గురువారం పరిశీలించారు. అధికారులు పూర్తిస్థాయిలో సాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ధూళిపూడి వెంకట రమణ, సూర్యనారాయణ తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

విద్యుత్ సమస్యలు–పరిష్కారంపై అవగాహన సదస్సు

కాట్రేనికోన: చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యుత్ వినియోగదారుల సమస్యలు–పరిష్కార మార్గాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సును విశ్రాంత జిల్లా న్యాయమూర్తి డా.బి.సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగంలో అంతరాయం, లోఓల్టేజి, మీటరు సమస్యలు, కొత్త సర్వీసుల జాప్యం తదితర సమస్యలను వినియోగదారుల ఫోరం పరిష్కరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.హరిబాబు, పి.శ్రీనివాస్, ఆర్.సురేంద్ర కుమార్, ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం లారీ అదృశ్యంపై కేసు

యానాం: అడివి పోలం గ్రామంలో గాయత్రి రైస్ మిల్లు నుంచి ఈ నెల 2న 28 టన్నుల ఉప్పుడుబియ్యం లోడుతో కేరళ రాష్ట్రానికి బయలుదేరిన లారీ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు గురువారం ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. లారీ 6వ తేదీకి కేరళ చేరుకోవాల్సి ఉందని, డ్రైవర్, క్లీనర్ మొబైల్ ఫోన్‌లు స్విచ్ ఆఫ్ వస్తున్నాయని రైస్‌మిల్లు యజమాని చౌదరి ఈ నెల 15న యానాం పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారన్నారు. క్రైమ్ టీమ్‌తో కలిసి ఎస్ఐ కట్టా సుబ్బరాజు కేరళ వెళ్లగా అక్కడే ఓ ప్రాంతంలో ఖాళీ లారీ ఉన్నట్లు తెలిసిందన్నారు.

వసతి గృహానికి చేతి పంపు అందజేత

అమలాపురం టౌన్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) ఆధ్వర్యంలో స్థానిక వడ్డిగూడెంలోని బాలికల ప్రభుత్వ వసతి గృహానికి బ్యాంక్ రీజనల్ హెడ్ కేఎన్‌వీ చిన్నారావు ద్వారా రూ.40 వేల విలువైన చేతి పంపు, విద్యుత్ దీపాలు గురువారం అందించారు. యూబీఐ అందించిన సదుపాయాలపై సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి జ్యోతిలక్ష్మి బ్యాంక్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వసతి గృహం విద్యార్థులకు యూబీఐ అధికారులు సమకూర్చిన సౌకర్యాలకు గుర్తుగా బ్యాంక్ సామాజిక బాధ్యత పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.లక్ష్మీనారాయణ, యూబీఐ బ్రాంచ్‌ల మేనేజర్లు కేశవవర్మ, శేషు ప్రవీణ్, శ్రీనివాస్ కుమార్, శ్యాంబాబు, శైలేంద్ర, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి పంచాయతీ పరిధిలో ఇటీవల అగ్ని ప్రమాదంలో తాటాకిళ్లు దగ్ధమైన ఘటనల్లో బాధితులైన మువ్వల మహాలక్ష్మమ్మ, బాసిన శ్రీనివాసరావుల కుటుంబాలకు గుడ్ సీడ్ అధినేత కుంచే రమణారావు సహకారంతో గురువారం నిత్యావసర సరకులు, దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, మువ్వల సత్యనారాయణ, పుచ్చల ఏసు, ఆశపు బుజ్జి, పరమట రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి నిధులు కేటాయించాలి

అమలాపురం టౌన్: పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల్లో కార్యకలాపాలు, అన్వేషణలు నిర్వహిస్తున్న పలు చమురు సంస్థలు ఈ ప్రాంత విద్యాభివృద్ధికి నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.భూషణం డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్ భవనంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యావ్యవస్థపై గురువారం జరిగిన జిల్లా స్థాయి చర్చలో భూషణం మాట్లాడారు. అనంతరం పీడీఎస్‌యూ విద్యా సంవత్సర వార్షిక క్యాలెండర్‌ను రాష్ట్ర ప్రతినిధులు ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, పీడీఎస్‌యూ అమలాపురం డివిజన్ అధ్యక్షుడు సాపే రమేష్, పి.అశోక్ తదితరులు ప్రసంగించారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

అమలాపురం రూరల్: కామనగరువు గ్రామంలో స్పందన స్ఫూర్తి, మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో 25 మంది మహిళలకు మూడు నెలల పాటు కుట్టు మిషన్ ఉచిత శిక్షణను అందించారు. సింగర్ కుట్టు మిషన్ల సంస్థ పరీక్షను నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన మహిళలకు కుట్టు మిషన్లు, కిట్లు, ధ్రువపత్రాలను సర్పంచ్ నక్కా అరుణ కుమారి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో స్పందన ఏవీబీ శ్రీనివాస్, మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ డైరెక్టర్ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమానికి ఉద్యోగులు సిద్ధంగా ఉండాలి

అమలాపురం టౌన్: ఏపీ జేఏసీ అమరావతి ఈ నెల 26న నుంచి తలపెట్టిన ఉద్యమానికి జిల్లాలోని ఉద్యోగులందరూ సిద్ధంగా ఉండాలని జేఏసీ జిల్లా శాఖ చైర్మన్ డి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అమలాపురంలో జిల్లా జేఏసీ ప్రతినిధులు గురువారం సాయంత్రం విలేకర్లతో మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.చిరంజీవి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఉండే వివాహాలు, విద్య, ఆరోగ్యం వంటి వాటికి ఆర్థిక అవసరాలను ప్రభుత్వం తీర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా జేఏసీ ప్రతినిధులు డాక్టర్ సీహెచ్ శ్రీరామ్, బి.సత్య శ్రీనివాస్, డీవీకే శేఖర్, సీహెచ్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

28న టైలర్స్ డే నిర్వహణ

అమలాపురం టౌన్: కుట్టు మెషీన్ సృష్టికర్త విలయమ్స్ హో జయంతి సందర్భంగా ఈనెల 28న అమలాపురం టౌన్ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడకలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పిశెట్టి మోహనరావు తెలిపారు. ఆ రోజు ఉదయం స్థానిక ముస్లిం వీధిలో నిర్వహించే ఈ వేడుకలకు పట్టణంలోని టైలర్స్ హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఐఆర్‌బీ పోలీసులకు ట్రావెలింగ్ అలవెన్స్

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా సాధారణ పోలీసులకు ఇచ్చినట్లుగానే ఇండియన్ రిజర్వు బెటాలియన్(ఐఆర్‌బీ) పోలీసులకు సైతం పర్మినెంట్ ట్రావెలింగ్ అలవెన్స్(టీఏ)ను మంజూరుచేస్తూ గురువారం హోం కార్యదర్శి హిరాన్ ఉత్తర్వులు జారీ చేశారు. వీటికి సంబంధించి నగదును ఫిబ్రవరి నెల జీతంలో వేయనున్నట్లు పేర్కొన్నారు. 2006 నుంచి జనవరి 31, 2023 వరకు టీఏ ఎరియర్స్‌ను చెల్లిస్తారన్నారు.

ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉప్పలగుప్తం: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో నంగవరం గ్రామానికి సంబంధించి ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నామని వైద్యాధికారి ఎల్.నాగార్జున గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.